క్లుప్తంగా

స్టూడెంట్ కిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మందస మండలం లోహరిబంద ప్రభుత్వ పాఠశాలలో స్టూడెంట్ కిట్లనను విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. పంచాయతీ సర్పంచ్ రాపాక జానకమ్మ ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, బూట్లు తదితర సాగ్రితో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా మందస మాజీ ఎంపీపీ దాసరి తాతారావు, గ్రామ పెద్దలు రాపాక శేషగిరి, కొరికాన వల్లభరావు, విద్యాకమిటీ చైర్మన్ అందాల అప్పారావు, అందాల రామారావు, ప్రధానోపాధ్యాయులు పిన్నింటి అరుణశ్రీ, జోగారావు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



గేదెలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

టెక్కలి: సీజనల్‌గా పశువులకు వ్యాపించే వ్యాధులను నివారించేందుకు తప్పనిసరిగా టీకాలు వేయాలని పశు వైద్యాధికారి ఎస్.వెంకటరమణ సూచించారు. స్థానిక చిన్నచాకలివీధిలో గేదెలకు వ్యాధి నిరోధక టీకాలను మంగళవారం వేశారు. జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలను విధిగా పశువులకు వేయించాలన్నారు. అలాగే సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సత్కారం



ప్రణవ్‌సాయిని సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

టెక్కలి: టెక్కలి పట్టణానికి చెందిన మలిపెద్ది మదుసూధనరావు, సంతోషికుమారి దంపతుల కుమారుడు ప్రణవ్‌సాయిని పట్టణ పట్టుశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానం చేశారు. ప్రణవ్‌సాయి ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 430వ ర్యాంకు, ఏపీ ఎంసెట్ ఫలితాల్లో 21వ ర్యాంకు, తెలంగాణా ఎంసెట్ ఫలితాల్లో 62వ ర్యాంకు సాధించాడు. పట్టుశాలి సంక్షేమ సంఘం ప్రతినిధులు మధుసూదనరావు, డి.శ్రీనివాస్, డి.సాంబశివరావు, ఎ.పార్వతీశం, కె.అచ్యుతరావు, డి.మురళీమోహన్, ఎ.విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో సంఘం సభ్యుల సమక్షంలో విద్యార్థి ప్రణవ్‌సాయితో పాటు తల్లిదండ్రులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

ఘనంగా చింతామణి అమ్మవారి మారుసంబరం



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి రైతులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో మారు సంబరాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అమ్మవారిని గ్రామపురవీధుల్లో ఊరేగించారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం లత

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల పేరెంట్స్‌కమిటీ సమావేశం హెచ్‌ఎం హెచ్‌ఎం వై.లత అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో సమస్యలను విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయ సిబ్బంది దృష్టికి తీసుకొచ్చారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. పాఠశాల సిబ్బంది దేవరాజు, రాజగోపాల్, ఫాల్గుణరావు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

జీవాల సేవలో సత్యసాయి భక్తులు!

- మూగజీవాల దాహార్తి తీరుస్తున్న వైనం
- చలివేంద్రాల ఏర్పాటు



పలాస పురుషోత్తపురం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం



కాశీబుగ్గలోని ఓ దుకాణం సమీపంలో ఏర్పాటు చేసిన గొలెంలో నీరు

కాశీబుగ్గ: దాహం వేస్తే మంచినీటి కోసం వెతుకుతాం. పట్టణ ప్రాంతంలో గుక్కెడు నీరు కావాలంటే కొనుక్కుని తాగుతాం. నగదు లేనివారైతే దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు, పబ్లిక్ కుళాయిలపై ఆధారపడి దాహాన్ని తీర్చుకుంటారు. ఇది నోరున్న మనుషులకు వర్తిస్తోంది. మరి నోరులేని మూగ జీవాల పరిస్థితి ఏమిటి? ఆలోచిస్తే పాపం అనిపించక మానదు. రోడ్లు, భవనాలు కనిపిస్తున్న ప్రాంతంలో మూగజీవాలకు ప్రాణ సంకటమనే చెప్పాలి. అటువంటి మూగ జీవాలకు మూగ మనసులగా మేమున్నామని ముందుకు వచ్చారు సత్యసాయి సేవా సమితి సభ్యులు. మనుషులకే చలివేంద్రాలు కాదు పశు పక్ష్యాదులకు మేమున్నామంటూ.. జీవాల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేసి..వాటి దాహార్తి తీర్చి ఆదర్శంగా నిలుస్తున్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పలాస సత్యసాయి సేవా సమితి సభ్యులు వేసవి ప్రారంభం నుంచి జూన్ మాసాంతం వరకూ పలు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. వేసవి రోజుల్లో పలు జంక్షన్లలో మనుషుల కోసం తొలుత చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఆ తరువాత మూగ జీవాల కోసం కూడా చలివేంద్రాలు నెలకొల్పారు. మూగజీవాలు పట్టణాలలో నడుస్తూ దుకాణాల వద్దకు వచ్చి మురుగు నీరు తాగడం, ఆరుబయట వృథాగా పోతున్న నీరు తాగడం, దుకాణాల వద్దకు వచ్చి కడిగేందుకు ఉంచిన నీటిని దొంగతనంగా తాగడం వంటి అంశాలను గుర్తించి మూగజీవాల పడుతున్న బాధను చూసిన సత్యసాయి సేవా సమితి సభ్యులు సమావేశం పెట్టుకున్నారు. జీవాల దాహార్తి తీర్చాలని తలపించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా జంటపట్టణాలలోని ముఖ్యమైన కూడళ్లను గుర్తించారు. సిమెంట్ గొలెలాను ఏర్పాటు చేసి వాటిలో ట్యాంకుల ద్వారా మంచినీటిని పోయిస్తున్నారు. అక్కడితో ఆగకుండా ప్రతి రెండు రోజులకు గొలెలాను కడగడం చేస్తుంటారు. అలాగే కొంతమంది శక్తిమేరకు పశువులకు పండ్లను సైతం అందిస్తున్నారు. ట్యాంకుల ద్వారా నీటిని తీసుకొచ్చి గొలెలాను నింపుతున్న విషయాన్ని గమనించిన మహిళలు స్పందించారు. మహిళలు సైతం గొలెలలో నీటిని తీసుకొచ్చి పోయడం ప్రారంభించారు. జీవాల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామంటే చాలామంది తొలుత నవ్వుకున్నారు. అయితే ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో అలాంటివారు ముక్కున వేలేసుకుంటున్నారు.



పలాసలోని శివారు వీధిలో చలివేంద్రం వద్ద పశువులకు పండ్లు పెడుతున్న సాయి భక్తులు



పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలను కలిపే రోడ్డు పక్కన నీటితో గొలెం

తొలుత మనుషుల కోసం చలివేంద్రం ఏర్పాటు



మానవసేవే మాధవ సేవని భావించి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నాం. తొలుత మనుషుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో కాశీబుగ్గ బస్టాండ్, పలాస ఆర్టీసీ కాంప్లెక్సుల వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశాం. అలాగే అనాథ తల్లిదండ్రులను గుర్తించి వారి ఇంటి వద్దకే నేరుగా క్యారేజీతో భోజనం చేరేలా చర్యలు చేపట్టాం. పదేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. సేవా కార్యక్రమాలు అంతటితో ఆగకుండా కొత్త ఆలోచనలతో మూగ జీవాలకు తాగునీరు అందించాలని నిర్ణయించాం. మండు వేసవిలో పట్టణ పరిధిలో ఉన్నజీవరాశులు ఎక్కడికి పోలేక ఇబ్బందులు పడకూడదని వాటి కోసం మంచినీటి చలివేంద్రాలు సత్యసాయి దయతో ఏర్పాటు చేశాం.

– మల్లా రామేశ్వరం, ప్రధాన సేవకులు, సత్యసాయి మందిరం, పలాస

నీటి కోసం అవస్థలు!



17వార్డు తిలక్‌నగర్‌లో ఓ ఇంటివద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మంచినీటి సమస్య తలెత్తింది. మున్సిపల్ తాగునీటి విభాగంలో అనేక సమస్యలు కారణంగా పూర్తి స్థాయిలో నీటిని అధికారులు సరఫరా చేయలేకపోతున్నారు. ప్రత్యేకంగా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ప్రజల అవసరం మేరకు అందించలేకపోతున్నారు. దీంతో గృహ నిర్మాణలు చేస్తున్న వారి ఇళ్ల వద్దకు స్థానికులు వెళ్లి నీటిని అడిగిపట్టుకొని తెచ్చుకొని అవస్థలు తీర్చుకుంటున్నారు.

ఏఐఎస్ఎఫ్ నిరసన

కాశీబుగ్గ: అధికంగా ఫీజులు వసూళ్లు చేయడం, పుస్తకాలను ఎక్కువ ధరలకు విక్రయించడం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. అధిక ఫీజులు వసూళ్లు, పుస్తకాలను అధికంగా విక్రయించడంపై కాశీబుగ్గలో ఓ ప్రైవేటు పాఠశాల వద్ద విద్యార్థుల తరపున మంగళవారం నిరసన తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనలు లెక్కచేయకుండా పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల నుంచి పుస్తకాల కోసం రూ. 11 వేల నుంచి రూ. 15 వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు గోరు వాసుదేవరావు, ఏఐఎస్ఎఫ్ పలాస నియోజకవర్గ అధ్యక్షులు పవన్‌కుమార్, విద్యార్థి సంఘ నాయకులు జశ్వంత్, జీవన్, సూర్య, ఆదర్శ్ ఉన్నారు.

టెక్కలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- మంత్రి అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గాన్ని రానున్న ఐదేళ్లలో మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి టీడీపీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. టెక్కలి నియోజకవర్గ ప్రజానీకం ఎన్నికల్లో భారీమెజార్టీతో తనను గెలిపించారని.. వారి ఆశయాలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తామన్నారు. గ్రామాల్లో కార్యకర్తలు క్రియాశీలంగా వ్యవహరించి ప్రభుత్వానికి, పార్టీకి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి మండల టీడీపీ అధ్యక్షుడు బోయిన రమేష్, నాయకులు కింజరాపు హరివరప్రసాద్, వి.కామేశ్వరరావు, కె.గోవిందరావు, మజ్జి కృష్ణారావు, మెట్ట మోహన్, మూగు అచ్చెయ్యరెడ్డి, మంగి రమణ ఉన్నారు.

భూ ఆక్రమణలను గుర్తించండి

- పలాస ఆర్డీవో భరత్ నాయక్



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

కాశీబుగ్గ: భూఆక్రమణలను గుర్తించి వాటిపై చర్యలు చేపట్టడానికి అధికార యంత్రాంగం సిద్ధం కావాలని పలాస ఆర్డీవో భరత్ నాయక్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌తో మంగళవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతీ అధికారి తమ పరిధిలో ఉన్నటువంటి ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడానికి సిద్ధం కావాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. భూ ఆక్రమణలు, స్పందన, శానిటేషన్ తదితర అంశాలపై సమీక్షించారు.

వరి విత్తనాలు పంపిణీ



పలాసపురంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు యశోద



సుంకిడిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి నర్సింహమూర్తి

సోంపేట: జాతీయ ఆహార భద్రత మిషన్ రాయితీతో వ్యవసాయశాఖ ద్వారా సరఫరా చేస్తున్న వరి విత్తనాలను పలాసపురం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. వ్యవసాయ సహాయకురాలు జీవిత పాల్గొన్నారు. అలాగే సుంకిడి, కొర్లాం, మాకన్నపురం గ్రామాల్లో వ్యవసాయధికారి బి.నర్సింహమూర్తి వరి విత్తనాలను రైతులకు అందజేశారు. విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు..



జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిన టెక్కలి పాత జాతీయ రహదారి



ముఖాలకు స్కార్ఫ్ చుట్టుకొని వెళ్తున్న విద్యార్థినులు

టెక్కలి: వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో ఎండలు తారెత్తిస్తున్నాయి. గత రెండు రోజులుగా భానుడి ప్రతాపానికి పట్టణవాసులు విలవిల్లాడుతున్నారు. ఉదయం నుంచి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో జనాలు అల్లాడిపోతున్నారు. ఉదయం పది గంటలకే ప్రధాన రహదారులన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసరంగా బయటకు వచ్చేవారు ఎండనుంచి రక్షణకు ముఖాలకు స్కార్ఫ్ చుట్టుకుంటున్నారు. రాత్రి వేళల్లో సైతం ఇదే ఉష్ణోగ్రతలు ఉండడంతో అవస్థలు పడుతున్నారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

కవిటి:

ప్రభుత్వం ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు వరిసాగు చేపట్టే రైతులకు రాయితీపై అందిస్తున్న విత్తనాల్ని రైతులంతా సద్వినియోగంచేసుకోవాలని సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు దుద్ది సతీష్ అన్నారు. మండలంలోని బొరివంక రైతు భరోసా కేంద్రం పరిధిలో వరి విత్తనాలను రైతులకు మంగళవారం పంపిణఈ చేశారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెందాళం విజయకృష్ణ, లోళ్ల శ్రీనివాసరావు ఉన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గట్టును తొలగించిన వారిపై ఫిర్యాదు



గట్టును పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సోంపేట: జింకిభద్ర గ్రామానికి చెందిన పుణ్యస్త్రీ గెడ్డ గట్టు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ తామాడ పద్మావతి, పలువురు రైతులు అధికారులను కోరారు. ఈ మేరకు తహసీల్దార్ విజయకుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల గెడ్డలో ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేపట్టి గట్టు చదును చేసి మట్టి వేశారు. అయితే ఆ మట్టిని కొందరు వ్యక్తులు లేబొటు కోసం తరలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో రెవెన్యూ సిబ్బందిని తహసీల్దార్ సంఘటన స్థలికి పంపించారు. గ్రామ రెవెన్యూ అధికారి లోకనాథం, సర్వేయర్ జగదీశ్ గట్టును పరిశీలించి నివేదికను తహసీల్దార్‌కు సమర్పించారు.

సత్యసాయి సంస్థల సేవలు ప్రశంసనీయం



రక్తదాతలకు సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

కవిటి: సత్యసాయి సంస్థల సామాజిక సేవలు ప్రశంసనీయమని కవిటి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బెందాళం రమేష్ అన్నారు. కవిటి భగవాన్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో కవిటిలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరం ద్వారా 25 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు రిమ్స్ వర్గాలు వెల్లడించాయి. రక్తదాతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయిసంస్థ కవిటి భజన మండలి అధ్యక్షుడు బెందాళం బాల భాస్కరావు, మొగలిపురి కృష్ణారావు, పొల్లాయి హేమాచలం, రమేష్ ఉన్నారు.

20న ద్విచక్ర వాహనాలు వేలం

వజ్రపుకొత్తూరు రూరల్: పలు మద్యం కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు పలాసలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ వద్ద ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్టు ఎస్ఈబి స్టేషన్ సీఐ ఎం.ఆర్.వి.అప్పారావు మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డుతో పాటు వెయ్యి రూపాయల ప్రవేశ రుసుం చెల్లించాలని సూచించారు. వేలంలో సొంతం చేసుకున్న వారికి ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి వాహనాలు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 94409 02357 నంబర్‌ను సంప్రదించాలి.

విద్యుత్ దీపాలు ఏర్పాటు



విద్యుత్ దీపాలు అమర్చుతున్న దృశ్యం

టెక్కలి రూరల్: టెక్కలి పట్టణంలోని ప్రధాన రహదారిలో విద్యుత్ దీపాలు ఇటీవల పాడయ్యాయి. దీంతో స్థానికులు చీకటితో ఇబ్బంది పడ్డారు. పాత వాటిని గత రెండు రోజులుగా సంబంధిత సిబ్బంది తొలగించి కొత్త లైట్లను ఏర్పాటు చేస్తున్నారు.

పలాస ఎమ్మెల్యేను కలిసిన మెప్మా సిబ్బంది



ఎమ్మెల్యే శిరీషాను అభినందిస్తున్న మెప్మా సిబ్బంది



శిరీషాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంవీఐ శ్రీనివాసరావు

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషాను మున్సిపాలిటీ మెప్మా కార్యాలయ సిబ్బంది మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మహిళా స్వయంశక్తి సంఘాల తరపున అభినందనలు తెలియజేశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 31 వార్డుల పరిధిలో ఉన్న 1087 స్వయంశక్తి మహిళా సంఘాలు, 12,867 సంఘ సభ్యులు, 46 మంది ఆర్పీలు, మెప్మా తరపున జరుగుతున్న కార్యకలాపాలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ మెప్మా విభాగానికి చెందిన సిటి మిషన్ మేనేజర్ పిన్నింటి మోహనరెడ్డి, సీవో పిల్లల స్వప్నకుమారి, డీఈవో బోర విజయకుమార్‌రెడ్డి, సీఎల్ఆర్పీలు పడమటింటి కవిత, మల్లా సంధ్యా, గొల్లంగి పద్మ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంవీఐ..

ఎమ్మెల్యే గౌతు శిరీషాను పలాస మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వై.శ్రీనివాసరావు కలిశారు. శాలువతో సత్కరించి.. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

30న కాటమ్మతల్లి సంబరాలు



మాట్లాడుతున్న శ్రీకాంత్

కాశీబుగ్గ: ఈ నెల 30వ తేదీన జరగనున్న కాటమ్మతల్లి సంబరాలను విజయవంతం చేయాలని 17వవార్డు కౌన్సిలర్, పట్టణ ఆటోయూనియన్ గౌరవ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏఎంసి గోదాం సమీపంలో మంగళవారం రాత్రి పట్టణ ఆటో యూనియన్ సభ్యులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి గోపయ్య, కిర్రి బాబూరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విత్తనాలు పంపిణీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడో వార్డు పరిధి చినబడం గ్రామంలోని శివకేశవ ఆలయం వద్ద బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు రైతులకు విత్తనాలను పంపిణీ చేయనున్నట్టు వ్యవసాయ అధికారి పోలారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యఅతిథిగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా హాజరవుతారన్నారు.